కౌన్సెలింగ్ బేఖాతర్

- ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 54 మందిపై రౌడీషీట్
- ప్రతి ఆదివారం కౌన్సెలింగ్‌కు వీరిలో 10 నుంచి 15 మందే హాజరు
- రౌడీషీటర్ల కదలికలపై కొరవడిన పోలీసుల పర్యవేక్షణ


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ (ఫైల్)

సీతమ్మధార : నగరంలోనే ఎంతో కీలకమైన పోలీస్ స్టేషన్లలో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఒకటి. కానీ ఈ స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లకు పోలీసులంటే ఏమాత్రం భయం లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతీ ఆదివారం స్టేషన్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కి విధిగా రౌడీషీటర్లు అందరూ హాజరుకావాల్సి ఉంది. ఎంతో బలమైన కారణముంటే తప్ప ప్రతీ వారం హాజరు కావాల్సిందే. ఫోర్త్‌టౌన్ పరిధిలో మొత్తం 54 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరిలో ఏడుగురు జైలులో ఉన్నారు. ఇద్దరిని వేరే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరిలో ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌కి పదిహేను మంది కంటే తక్కువ మందే హాజరవుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పోలీసుల పర్యవేక్షణ, నిఘా కొరవడడంతో రౌడీషీటర్లకు భయం లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నగర సీపీ ఆదేశాలు బేఖాతర్

స్టేషన్ పరిధిలో తరచూ రౌడీషీటర్లు హల్‌చల్ చేయడం ప్రజలకు పెద్ద తలనొప్పి వ్యవహారంగా మారింది. ప్రశాంత నగరంలో వీరి అల్లర్లు, దురుసు తనంతో నగరవాసులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి రౌడీషీటర్లను గట్టిగా హెచ్చరించారు. గొడవలకు దూరంగా ఉండాలని... లేదంటే నగరం వదిలి వెళ్లిపోవాల్సిందే అంటూ తేల్చి చెప్పేశారు. కానీ ఫోర్త్ టౌన్ పోలీసులు మాత్రం సీపీ ఆదేశాలను లైట్ తీసుకున్నారో ఏమోగానీ ఆదివారం నిర్వహించే కౌన్సెలింగ్‌కి పూర్తి స్థాయిలో రౌడీషీటర్లు హాజరు కాక పోయినా కనీస చర్యలు చేపట్టకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. వాస్తవానికి కౌన్సెలింగ్ మరికాసేపటిలో ప్రారంభం కానుందనగా రౌడీషీటర్లకు పోలీసు సిబ్బంది ఫోన్ చేసి వస్తున్నారా..? లేదా..? అన్న విషయం నిర్ధారించుకోవాల్సి ఉంది. కానీ నాలుగో పట్టణ పోలీసులు ఈ విషయాన్ని లైట్ తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వచ్చిన కొద్ది మంది రౌడీషీటర్లు స్టేషన్‌లోని బుక్‌లో సంతకాలు చేసి... మీడియా కోసం ఓ ఫొటో తీసేసుకుని... కౌన్సెలింగ్ అయిపోయిందిలే అనుకుని వెళ్లిపోతున్నారు. వీరు ఇలా వచ్చి అలా వెళ్లిపోయినంత కాలం వారి ప్రవర్తనలో మార్పు రాదని, అసలు ఉద్దేశం నెరవేరదని పలువురు అంటున్నారు.

రౌడీషీటర్లు ప్రస్తుతం ఏం చేస్తున్నారు... ఎలా బతుకుతున్నారు... ఇతర విషయాలు పోలీసు అధికారులు తెలుసుకుని వారికి మార్గదర్శనం చేస్తేనే అందరికీ ప్రయోజనకరమని అంటున్నారు. కౌన్సెలింగ్‌కు రౌడీషీటర్ల హాజరు శాతం పెంచేలా కృషి చేయాల్సిన సీఐ, ఎస్‌ఐలు ఎందుకనో ఆ దిశగా దృష్టి సారించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రతీ వారం నిర్వహించే కౌన్సెలింగ్‌కి రౌడీషీటర్లు పూర్తిస్థాయిలో హాజరయ్యేలా కృషి చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

రొటేషన్ పద్ధతిలో కౌన్సెలింగ్‌కి ఒప్పందం!

సమాజంలో అలజడి సృష్టించే రౌడీషీటర్లు అదుపులో ఉండాలంటే వారికి కౌన్సెలింగ్ నిర్వహించి నడవడికలో మార్పు తీసుకురావాలి. అప్పుడే వారూ కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించడంతోపాటు నగరమూ ప్రశాంతంగా ఉంటుంది. ఆ దిశగా పోలీస్ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. ఒక వారం తక్కువ మందే కౌన్సెలింగ్‌కి వస్తే... వెంటనే అప్రమత్తమై ఆ తర్వాతి వారం ఎక్కువ మంది కౌన్సెలింగ్‌కు స్టేషన్‌కు వచ్చేలా పోలీసులు చర్యలు తీసుకోవాలి. ఇక్కడ మాత్రం ప్రతీ వారం పది నుంచి 15 మంది రౌడీషీటర్లే కౌన్సెలింగ్‌కు వస్తున్నా పోలీసు అధికారులు, సిబ్బంది సంబంధం లేనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. మరోవైపు రౌడీషీటర్లు కూడా కూడబలుక్కుంటున్నారో ఏమో గానీ రొటేషన్ ప్రకారం స్టేషన్‌కు వస్తున్నారు. ఈ వారం కొందరు కౌన్సెలింగ్‌కి వెళ్తే... వచ్చే వారం మరికొందరు కౌన్సెలింగ్‌కు హాజరయ్యేలా ముందే ఒప్పందం చేసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా కౌన్సెలింగ్‌కి హాజరుకాకపోయినా పోలీసు ఉన్నతాధికారులు లైట్ తీసుకుంటారులే అన్న భావన చాలా మంది రౌడీషీటర్లలో ఉంది. అందువల్లే నిర్లిప్త ధోరణితో వ్యవహరిస్తున్నారు.

జయగోపాల్‌కు పెరియార్ అవార్డు సముచితం


మాట్లాడుతున్న భారత నాస్తిక సమాజం నాయకులు శ్రీరామమూర్తి, నూకరాజు

సీతంపేట : నాస్తికవాది, భారత నాస్తిక సమాజం వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్‌కు మరణానంతరం ప్రముఖ సాంఘిక ఉద్యమకారుడు పెరియార్ అవార్డును ప్రకటించడం సముచితమని భారత నాస్తిక సమాజం నాయకులు టి.శ్రీరామమూర్తి, వై.నూకరాజు అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చెన్నైలోని ద్రవిడ కజగం, పెరియార్ తమిల్ ఫోరం ఈ నెల 15న డాక్టర్ కె.వీరమణి చేతుల మీదుగా పెరియార్ అవార్డు అందజేసినట్టు తెలిపారు. 1972లో డాక్టర్ జయగోపాల్ స్థాపించిన భారత నాస్తిక సమాజం దేశంలోని ఎనిమిది రాష్ట్రాల్లో మూఢనమ్మకాల నిర్మూలన, హక్కుల సాధనకై కృషి చేసిందన్నారు. దళితులపై, స్త్రీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా, మానవహక్కుల పరిరక్షణకు చేసిన కృషికి గుర్తింపుగా పెరియార్ అవార్డు దక్కిందన్నారు. సీపీఐ నాయకుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ పెరియార్ అవార్డుకు జయగోపాల్ అన్నివిధాలా అర్హుడన్నారు. సమావేశంలో నాస్తిక సమాజం నాయకులు జె.రవి, జె.శ్యామల, జె.సునీత, రాంప్రభు, విజ్ఞానంద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతుబజారు స్టాళ్లకు డ్రా


డ్రా తీసి టోకెన్ ఇస్తున్న ఈవో కృష్ణమూర్తి

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో సోమవారం 63 స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం, సాయంత్రం విక్రయాలు జరిపేందుకు వీలుగా డ్రా తీసి రైతులకు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కృష్ణమూర్తి టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతీ వారం రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులు వారికి కేటాయించిన స్టాళ్లలోనే కూరగాయలు విక్రయించాలని స్పష్టం చేశారు. స్టాళ్లు ఉన్న వారు కూరగాయలు నేల మీద విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో లలితాపీఠం ఉత్తరాధికారి


అప్పన్న ఆలయంలో దత్తేశ్వరానంద భారతీస్వామి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని విశాఖలోని లలితాపీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి సోమవారం దర్శించుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

శత జయంతి ఉత్సవాలకు ఆహ్వానం


దత్తేశ్వరానంద భారతీస్వామికి ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

సీతంపేట : అనకాపల్లిలో గల శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో వచ్చే నెల 4 నుంచి 8 వరకు నిర్వహించనున్న ప్రతిష్ట, శత జయంతి మహా కుంభాభిషేక మహోత్సవాలకు శ్రీ లలితాపీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామికి ఆలయ కమిటీ ప్రత్యేక ఆహ్వానం అందజేసింది. సోమవారం పీఠంలో ఉన్న స్వామి వారిని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. 8న జరగనున్న మహాకుంభాభిషేకంలో పాల్గొంటానని ఆలయ ప్రతినిధులకు దత్తేశ్వరానంద భారతీ స్వామి తెలిపారు.

నిరాశ్రయులకు వసతి



నిరాశ్రయులతో వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి

సీతమ్మధార : చాలా రోజులుగా స్నానపానాలు లేకుండా రోడ్ల మీద తిరుగుతున్న ఐదుగురు నిరాశ్రయులను సోమవారం ఏయూటీడీ సిబ్బంది ద్వారకానగర్‌లో గల షెల్టర్‌కు తరలించారు. విశాఖకు చెందిన బీమరశెట్టి జ్యోతి ప్రకాష్ (56), ప్రతాప్ (45), సాలూరుకు చెందిన అలమండ శంకర్ (42), రాజస్థాన్‌కు చెందిన సికిందర్ (40), పార్వతీపురం ప్రాంతానికి చెందిన గొడ్డి కంచరి కృష్ణను ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో గుర్తించి తరలించారు. వీరికి ఆశ్రయం కల్పించడంతోపాటు ఉపాధి చూపిస్తామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. కార్యక్రమంలో వసతి గృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలి


ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో తహసీల్దార్ రమేష్, తదితరులు


అర్జీదారు సమస్య వింటున్న సూపరింటెండెంట్ రాజు


పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న జోన్‌-3 జెడ్సీ శివప్రసాద్

సీతమ్మధార : సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అర్జీదారులు ఏడు వినతులు అందజేశారు. తహసీల్దార్ ఎం.రమేష్ అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన కార్యక్రమంలో కుల, ఆదాయ, నివాస, ఇతర ధ్రువీకరణ పత్రాలు, కుటుంబ సభ్యుల పత్రం (ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్)తో పాటు విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజల నుంచి వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్ – 3 ఇంజినీర్ విజయకుమార్, రైల్వే న్యూ కాలనీ జీవీఎంసీ స్కూల్ హెచ్ఎం కె.రాము, జోన్ – 5 ఆర్వో బాబూరావు, హౌసింగ్ ఏఈ ప్రభ, డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం : జీవీఎంసీ జోన్ – 5 జ్ఞానాపురం కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు సోమవారం రెండే వినతులు వచ్చాయి. అర్జీదారుల నుంచి జోనల్ సూపరింటెండెంట్ రాజు వినతులు స్వీకరించారు. సూపరింటెండెంట్ – 2 వెంకటరమణ, రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రవీణ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్, ఏపీడీవోలు కృపానంద, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జోన్‌–3 పీజీఆర్ఎస్‌లో రెండు ఫిర్యాదులు

సీతమ్మధార: నగరంలోని ఆశీలమెట్టలో గల జోన్‌–3 కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి నాలుగు వినతులు అందాయి. జెడ్సీ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, డిప్యూటీ ఇంజినీర్ పద్మావతి, సహాయ వైద్యాధికారి డాక్టర్ భాస్కరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వాణి, టీపీఎస్ నారాయణరావు, యూసీడీ ఏపీడీ ఎల్.రాము తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడించిన డీసీపీ – 2 మేరీ ప్రశాంతి


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ – 2 మేరీ ప్రశాంతి

మద్దిపాలెం : గత ఏడాది నవంబర్ 29న ఊర్వశి జంక్షన్ దరి ఐటీఐ కూడలి వద్ద ఆర్టీసీ బస్సులో మహిళపై దాడికి పాల్పడింది ఓ యాచకుడని, అలాగే అతడు ఉపయోగించింది యాసిడ్ కాదని బాత్రూమ్‌లు శుభ్రపరిచే (తక్కువ మోతాదులో ఉన్న కాన్సన్‌ట్రేటెడ్ హైడ్రోక్లోరిక్ యాసిడ్) రసాయనమని డీసీపీ – 2 మేరీ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఘటనకు సంబంధించిన వివరాలు సోమవారం కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో ఆమె వెల్లడించారు. ఐటీఐ జంక్షన్ వద్ద గోపాలపట్నం నరసింహనగర్ ప్రాంతానికి చెందిన ఓ యాచకుడు బస్సు దిగి బయట నుంచి మహిళపై యాసిడ్ పోసి వెళ్లిపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు అందిందని తెలిపారు. మహిళ వెనుక ఉన్న వారిపై కూడా ఆ ద్రావకం చుక్కలు పడినట్టు ఆమె వెల్లడించారు. అయితే అప్పుడు యాసిడ్ దాడి జరిగినట్టు బాధితులు చెప్పడంతో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పందించి విచారణకు ఆదేశించారని, మొత్తం 21 ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టామని తెలిపారు. యాసిడ్ దాడి జరిగినట్టు ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. అన్ని విధాలుగా విచారించామని, నిందితుడికి, బాధితులకి మధ్య కక్షలు, గొడవలు ఉన్నట్టు కనిపించలేదని ఆమె స్పష్టం చేశారు. ఘటనా స్థలంలోని సీసీ కెమెరా ఫుటేజీలు పరిశీలించామని, సదరు యాచకుడు గోపాలపట్నం ప్రాంతానికి చెందిన వెంకట శ్రీనివాస్‌గా గుర్తించామని తెలిపారు. సదరు యాచకుడు తరచూ 28వ నంబర్ ఆర్టీసీ బస్సులో రాకపోకలు సాగిస్తుంటాడని, ఈ క్రమంలో టికెట్ తీసేందుకు నిరాకరిస్తుంటాడని... ఆ క్రమంలోనే బస్సు కండక్టర్, డ్రైవర్ మీద కాన్సన్‌ట్రేటెడ్ హైడ్రోక్లోరిక్ యాసిడ్ పోసేందుకు ప్రయత్నిస్తే... అది మహిళపై పడినట్టు అంచనా వేసినట్టు ఆమె తెలిపారు. నిందితుడిని సోమవారం కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. సమావేశంలో ద్వారకా జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఎస్‌ఐలు సమీర్, దివ్యభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలు సమస్యలు పరిష్కరించండి


మేయర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ గంకల కవిత నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్‌కు సోమవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. వార్డులో పర్యటించి సమస్యలు గుర్తించాలని, పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేసేందుకు కృషి చేయాలని, వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటన పెద్ద డ్రామా


నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : ఆంధ్ర రాష్ట్రంలోని ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని సీఐటీయూ అక్కయ్యపాలెం జోన్ కమిటీ నాయకులు జి.అప్పలరాజు, గౌరీష్ డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద నిర్వహిస్తున్న దీక్షా శిబిరంలో వారు సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కి కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటన పెద్ద డ్రామా అని విమర్శించారు. ఇది కూడా ప్రైవేటీకరణలో ఒక భాగమే అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో కొనసాగుతుందా..? లేదా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వంలో కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో బయటకు నెట్టేయడం జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉక్కు కర్మాగారం కోట్లాది రూపాయలు పన్నుల రూపంలో చెల్లిస్తోందన్నారు. ఇప్పటికైనా సొంత గనులు కేటాయిస్తే ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నినాదాలు చేశారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి


అచ్యుతరావు

అల్లిపురం : విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,500 కోట్లు తాత్కాలిక ఉపశమనమే తప్ప దీర్ఘకాలంలో ప్రయోజనం లేదని ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు అన్నారు. పూర్తి సామర్థ్యంతో మునుపటి వలే ప్రభుత్వ రంగ సంస్థగా మనుగడ సాగించాలంటే సొంత గనులు కేటాయించాలని ఆయన సోమవారం డిమాండ్ చేశారు. సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. ప్లాంట్‌లో ఉత్పత్తి మెరుగుపడాలంటే ఖాళీగా ఉన్న 5 వేలు పోస్టులు భర్తీ చేయాలని, ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు


జెడ్సీ శివప్రసాద్

సీతమ్మధార: జీవీఎంసీ జోన్‌–3 పరిధిలో ఎంపిక చేసిన సచివాలయాలలో ఈ నెల 21వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తామని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ తెలిపారు. జోనల్ కార్యాలయంలో ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు. పుట్టినప్పటి నుంచి ఇంతవరకు ఆధార్ నమోదు కాని పిల్లల కోసం ఈ శిబిరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆసక్తి గల పిల్లల తల్లిదండ్రులు తమ ఆధార్‌కార్డులతో ఈ సచివాలయాలలో ఉదయం 10.30 గంటలనుంచి సాయంత్రం 4 గంటలలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసుకోవాలని కోరారు.

- ఉత్తర నియోజకవర్గంలోని అక్కయ్యపాలెం దరి లలితానగర్‌లో గల 125 సచివాలయంలో, పాత రేసపువానిపాలెంలోని 138 సచివాలయంలో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.
- తూర్పు నియోజకవర్గ పరిధి 17వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్‌-1 నేతాజీపార్కులో గల 106 సచివాలయంలో, మద్దిలపాలెంలోని 117 సచివాలయంలో శిబిరాలు జరుగుతాయన్నారు.

పాపా హోమ్‌లో అన్నదానం


బాలికలకు ఆహారం వడ్డిస్తున్న కమలాకర్

సీతమ్మధార : స్థానిక పాపా హోమ్‌లో జాతీయ క్రికెటర్, కాంగ్రెస్ పార్టీ క్రీడా విభాగం చైర్మన్ జీవీఎస్ కమలాకర్ జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. పాపా హోమ్‌లో బాలికలకు ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం ఏర్పాటు చేశారు. బాలికల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. క్రీడలపై ఆసక్తి ఉంటే తనను సంప్రదించాలని, చేతనైన సాయం చేస్తానని హామీ ఇచ్చారు.

నిత్యావసర సరకుల అందజేత


సరకులు అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్ : మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మురళీనగర్ బ్యాంకు వీధిలో సోమవారం నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో భాగంగా అనాథ బాలల ఆశ్రమానికి నిత్యావసర సరకులను క్లబ్ మహిళలు అందించారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వాకర్స్ క్లబ్‌ల వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్‌దాస్ 22వ వర్ధంతి నిర్వహించారు. ఆళ్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృపా సాధన అనాథ బాలల బాలికల ఆశ్రమానికి 50 కేజీల బియ్యం, కిరాణా సామగ్రిని జిల్లా 101 గవర్నర్ కె.ద్వారకానాథ్ చేతుల మీదుగా నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఆర్సీ – 5 ఉప్పలపాటి శుభ, మహిళా వాకర్స్ క్లబ్ కార్యదర్శి పి.కమల, కోశాధికారి ఎం.శేషామణి, డి.శిరీష, ఎ.రాధ, కె.సుగుణ, మాధవీలత పాల్గొన్నారు.

ఆళ్వార్‌దాస్‌కు ఘన నివాళి

మురళీనగర్ : మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ సంస్థల వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్‌దాస్ వర్ధంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆళ్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉప్పలపాటి శుభ, వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, ఎం.జయ, పి.మహాలక్ష్మి, ఆర్.సుదిత, కె.భానుమతి, సీహెచ్ పద్మావతి, ఎం.ప్రమీలరావు పాల్గొన్నారు.

వ్యర్థాలు గెడ్డలో విడిచిపెట్టేందుకు యత్నం


సీతంపేటలో వీటీ హైస్కూల్ వద్ద గెడ్డలో వ్యర్థాలు విడిచిపెట్టడానికి సిద్ధమైన ట్యాంకర్

సీతంపేట : సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేసిన తర్వాత ట్యాంకర్‌తో తీసుకొచ్చిన వ్యర్థాలను నగరం మధ్యలోని గెడ్డలో విడిచిపెట్టడాన్ని స్థానికులు అడ్డుకున్నారు. జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట వీటీ హైస్కూల్ ఎదురుగా ఉన్న గెడ్డలో సోమవారం ఉదయం సెప్టిక్ ట్యాంకులో వ్యర్థాలను విడిచి పెట్టడానికి ట్యాంకు నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. అక్కడ ఉన్న స్థానికులు గమనించి... ఇదేంటి ఇళ్ల మధ్య ఉన్న గెడ్డలో సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలు ఎలా విడిచిపెడతారని ప్రశ్నించారు. ఇక్కడ విడిచిపెట్టడానికి వీల్లేదని అడ్డుకున్నారు. పట్టపగలే ఊరి మధ్యలో ఉన్న గెడ్డలో వ్యర్థాలు డంప్ చేయడానికి ప్రయత్నించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ట్యాంకర్ డ్రైవర్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. జీవీఎంసీ శానిటేషన్ అధికారులు ఇటువంటి వాటిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

క్షతగాత్రునికి ఆశ్రయం


ప్రతాప్

సీతమ్మధార : కుడి చేయి పురుగులు పట్టేసి అత్యంత దుర్భర స్థితిలో తిరుగుతున్న ప్రతాప్ (45) అనే వ్యక్తికి ద్వారకానగర్‌లోని జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో సోమవారం ఆశ్రయం కల్పించారు. అనంతరం చేతికి ప్రథమ చికిత్స చేసి 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. శస్త్రచికిత్స చేసి చేయి తొలగిస్తామని వైద్యులు చెప్పారని ఏయూటీడీ వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు శ్రీనివాస్, ప్రశాంత్ తెలిపారు.

ముగిసిన ఉరుసు ఉత్సవాలు


హజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ముస్లింలు

మహారాణిపేట : ముస్లిం తాటిచెట్లపాలెంలో హజరత్ ఖాదర్ వలీ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న హజరత్ ఖ్వాజా గరీబ్ నవాజ్ ఉరుసు ఉత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. తొలి రోజు ఫజర్ నమాజ్ అనంతరం ఖురాన్ పఠనం, మగ్రిబ్ నమాజు అనంతరం చందనోత్సవం వైభవంగా నిర్వహించారు. రెండో రోజు పిల్లలకు ఆధ్యాత్మిక పోటీలు నిర్వహించారు. చివరి రోజైన సోమవారం హైదరాబాద్‌కు చెందిన ఆధ్యాత్మిక వక్త హజరత్ మౌలానా ఒవైస్ రజా ప్రసంగించారు. హజరత్ గరీబ్ నవాజ్ జీవిత చరిత్ర, ఇతరుల పట్ల చూపిన ప్రేమ, ఆయన సందేశం వివరించారు. గరీబ్ నవాజ్‌ను ఆదర్శంగా తీసుకుని సమాజానికి మంచి చేయాలని సూచించారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖాదర్ వలీ కమిటీ సభ్యులు, మసీదు కమిటీ సభ్యులు ఆధ్యాత్మికవేత్తలను సత్కరించారు. అనంతరం అన్నప్రసాదం పంపిణీ చేశారు.